సాక్షి
జోగులాంబ గద్వాల

శుక్రవారం, 1, డిసెంబర్, 2023



ఉత్సాహంగా తొలిఓటు
ఈసారి కొత్తగా ఓటుహక్కు పొందిన యువతీ, యువకులు ఉత్సాహంగా ఓటేశారు.
వివరాలు 8లో ▸



కొత్త మద్యం పాలసీ
జిల్లాలో శుక్రవారం నుంచి కొత్త మద్యం పాలసీ విధానం అమల్లోకి రానుంది.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.4 /20.9

వాతావరణం
అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తెల్లవారుజామున, రాత్రివేళలో చల్లని గాలులు వీస్తాయి.

తీర్పు.. ఇచ్చేశారు

గద్వాల జిల్లాలో 79.29శాతం పోలింగ్


- మధ్యాహ్నం తర్వాత పోటెత్తిన ఓటర్లు
- అత్యధికంగా కల్వకుర్తి, అత్యల్పంగా మక్తల్‌లో..
- పలు పోలింగ్ స్టేషన్లలో మొరాయించిన ఈవీఎంలు
- సాయంత్రం 5 దాటిన తర్వాత కూడా బారులు..
- ఈ నెల 3న ఓట్ల లెక్కింపు.. గెలుపుపై ఎవరి ధీమా వారిదే..


గద్వాలలోని ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాలలోని పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల క్యూ..

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: సార్వత్రిక ఎన్నికల పోరులో భాగంగా ఉమ్మడి పాలమూరులో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గురువారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగాల్సి ఉండగా, పలు పోలింగ్ స్టేషన్లలో ఈవీఎంలు మొరాయించాయి. ఫలితంగా నిర్దేశిత సమయం సాయంత్రం ఐదు గంటలు దాటిన తర్వాత కూడా పలు కేంద్రాల్లో ఓటర్లు బారులు దీరారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం పోలీసు బందోబస్తు మధ్య ఈవీఎంలను ఆయా ప్రాంతాల్లోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. చెదురుముదురు ఘటనలు మినహా.. పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం, పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. మరోవైపు ఉమ్మడి జిల్లాలో దాదాపుగా అన్ని నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోరు కొనసాగినట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తుండగా.. అభ్యర్థులు ఎవరికి వారు తామే విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. వచ్చే నెల మూడో తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనుండగా.. అదే రోజు ఫలితాలు వెల్లడికానున్నాయి. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా.. 11 గంటల వరకు మందకొడిగా సాగింది. ఆ తర్వాత కొంత ఊపందుకున్నప్పటికీ.. మధ్యాహ్నం మూడు తర్వాత మళ్లీ నెమ్మదించింది. చివరలో మళ్లీ ఓటర్లు ఒక్కసారిగా పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. కొన్ని చోట్ల రాత్రి తొమ్మిది గంటలు దాటిన తర్వాత కూడా ఓటర్లు క్యూలో నిల్చొన్నారు.

❒ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 14 నియోజకవర్గాలు ఉండగా.. కల్వకుర్తిలో పోలింగ్ శాతం అత్యధికంగా 83.23 నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. గద్వాల (82.42శాతం), దేవరకద్ర (82.33), జడ్చర్ల (81.18)లో 80శాతానికి పైగా పోలింగ్ శాతం నమోదైంది. అత్యల్పంగా మక్తల్ నియోజకవర్గంలో 69.12 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

జిల్లాల వారీగా పోలింగ్ శాతం



నియోజకవర్గాల వారీగా గత, ప్రస్తుత ఎన్నికల్లో పోలింగ్ శాతం..

నియోజకవర్గం	2018	2023
మహబూబ్‌నగర్	74.93	70.41
జడ్చర్ల	82.32	81.18
దేవరకద్ర	85.11	82.33
కొడంగల్	81.98	70.50
నారాయణపేట	79.67	78.29
మక్తల్	77.77	69.21
వనపర్తి	81.40	77.54
నాగర్‌కర్నూల్	83.21	78.58
అచ్చంపేట	81.85	79.97
కల్వకుర్తి	87.21	83.23
షాద్‌నగర్	88.07	74.00
కొల్లాపూర్	83.17	79.89
గద్వాల	83.94	82.42
అలంపూర్	82.66	76.16


భారీ మెజారిటీతో గెలుస్తా



ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుబాటులో ఉండి చేసిన సేవా, అభివృద్ధి నన్ను గెలిపిస్తాయని ముందు నుంచి కూడా నేను చెప్పాను. ఈరోజు జరిగిన పోలింగ్ సరళి తీరును పరిశీలిస్తే నాగెలుపు ఖాయంతో పాటు, గతంలో కంటే అత్యధిక మెజారిటీ వస్తోందన్న నమ్మకం ఉంది.

– బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే

బీజేపీపై నమ్మకంతోనే..



రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, కాంగ్రెస్ పై ప్రజలకు విశ్వాసం లేకపోవడం, ప్రధాని మోదీ అందిస్తున్న సుపరిపాలన అంతిమంగా ప్రజలు నన్ను గెలిపించబోతున్నారు. ఈ రోజు పోలింగ్ తీరు ఇందుకు నిదర్శనం.

– పి.బోయశివారెడ్డి, బీజేపీ అభ్యర్థి

నా విజయం ఖాయం



గద్వాల వ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియ అంతా కూడా ప్రశాంతంగా సాగింది. ఎక్కడా కూడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. పోలింగ్ కొనసాగిన తీరును చూస్తేనే అర్థమవుతుంది నా గెలుపు ఖాయం అని.

– కె.సరిత, కాంగ్రెస్ అభ్యర్థి, జెడ్పీచైర్‌పర్సన్

పనిచేసే వారికే గుర్తింపు



ప్రజల కోసం పని చేసే వారికి ఎప్పటికి గుర్తింపు ఉంటుంది. ప్రజల కోసం నేను చేసిన శ్రమను బీజేపీ గుర్తించింది. పార్టీ ఇచ్చిన అవకాశంతోనే అలంపూర్ అసెంబ్లీ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా పోటి చేశాను. గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజల ముందుకు వెళ్లడం జరిగింది. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తా.

– పెరుమాళ్ల రాజగోపాల్, బీజేపీ అభ్యర్థి, అలంపూర్

ప్రజల మద్దతు బీఆర్‌ఎస్‌కే



ప్రజల మద్దతు బీఆర్‌ఎస్‌కే ఉందని ప్రజలు మరోసారి రుజువు చేయబోతున్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో ఉండి ప్రచారానికి వెళ్లిన ప్రతి చోట మంచి స్పందన లభించింది. ఆ స్పందన ఓటర్లు ఓటు వేసే సమయంలో చూపించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడి ముచ్చటగా మూడవసారి కేసీఆర్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారు. ప్రజలు అందించిన మద్దతుతో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా భారీ మెజార్టీతో విజయం ఖాయం.

– విజయుడు, బీఆర్‌ఎస్ అభ్యర్థి, అలంపూర్

అధికార పార్టీ మోసాలపై విసిగిపోయారు



రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమైంది. ఓటర్ల నుంచి వచ్చిన స్పందన ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తోందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన మోసాలతో ప్రజలు విసిగిపోయారు. అందుకే కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలిచారు. ప్రధానంగా రైతులు, మహిళలు, యువత కాంగ్రెస్‌కు వెన్నుదన్నుగా నిలిచారు. ఊహించని విధంగా వచ్చిన ఈ మార్పుతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రాబోతుంది. అలంపూర్‌లో సైతం భారీ మెజార్టీతో గెలబోతున్నాం. పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

– ఎస్‌ఏ సంపత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, అలంపూర్

బీఎస్పీకి బాసటగా నిలిచారు



నియోజకవర్గంలో ఓటర్లు బీఎస్పీకి మద్దతుగా నిలిచారు. ఇతర పార్టీలు డబ్బు, మద్యంతో ప్రలోభ పెట్టిన ఓటర్లు చైతన్యవంతంగా ఉంటు బీఎస్పీకి బాసటగా నిలిచారు. ఉదయం మహిళలు, యువత అధికంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో మార్పును కోరుకుంటున్నారు కాబట్టి అది బీఎస్పీకి అండగా ఉంటుంది. ఈ ఎన్నికల్లో బీఎస్పీ మంచి ఫలితాలు సాధిస్తుందని ఆశిస్తున్నాం.

– ప్రసన్న కుమార్, బీఎస్పీ అభ్యర్థి, అలంపూర్

చెదురుముదురు ఘటనలు ఇలా..

❒ మక్తల్ నియోజకవర్గ పరిధి మాగనూర్ మండలం వర్కూరులో బీఆర్‌ఎస్ అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి చుక్కెదురైంది. 59, 60వ పోలింగ్ స్టేషన్‌లోకి బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి వెళ్తుండగా.. కాంగ్రెస్ శ్రేణులు అడ్డుకోవడం ఉద్రిక్తతకు దారితీసింది. చిట్టెం, ఆయన వాహనంపై హస్తం శ్రేణులు దాడికి యత్నించగా.. పోలీసులు, గన్‌మెన్లు ఎమ్మెల్యేను వాహనంలో అక్కడి నుంచి పంపించారు.

❒ మహబూబ్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలోని శ్రీనివాస కాలనీలో 100, 101 పోలింగ్ స్టేషన్ల వద్ద టీఎన్జీఓస్ మాజీ అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమకారుడు రాజేందర్ రెడ్డిపై కొందరు దాడి చేశారు. తనపై బీఆర్‌ఎస్ నాయకులు దాడి చేశారని మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో రాజేందర్‌రెడ్డి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

❒ పదర మండలం వంకేశ్వరంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. ఉదయం ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్నారని ఇరువర్గాల నాయకులు, కార్యకర్తల మధ్య మాటామాట పెరిగి తోపులాట, ఘర్షణ జరగడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. సీఐ ఆదిరెడ్డి, ఎస్‌ఐ తిరుపతిరెడ్డి అక్కడికి చేరుకొని ఇరువర్గాల వారికి నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు.

❒ దేవరకద్ర మండలంలోని బల్సుపల్లిలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య గొడవ జరిగింది. పోలింగ్ కేంద్రం సమీపంలో రెండు వర్గాల వారు ప్రచారం చేసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. వెంటనే పోలీసులు కల్పించుకొని ఇరు వర్గాలను చెదరగొట్టారు. అడవి అజిలాపూర్‌లోనూ ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి. మండల నాయకులు గ్రామానికి రావడంతో అడ్డుకోగా.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది.


బల్సుపల్లిలో గొడవ పడుతున్న గ్రామస్తులను చెదరగొడుతున్న పోలీసులు

❒ గద్వాల పట్టణంలో మోమిన్‌మహల్ల, దౌదార్పల్లిలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోగా.. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు.

❒ హన్వాడమండలంలోని కొత్తపేటలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన చందర్‌నాయక్, రామచందర్‌లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవినాయక్ తెలిపారు. పోలింగ్ బూత్ ముందు ప్రచారం చేస్తుండటంతో ఘర్షణ చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ఇరువురిపై కేసులు నమోదు చేశారు.

❒ కొల్లాపూర్ మండలంలోని ఎల్లూరులో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వెళ్లిన ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డితో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హన్మంతునాయక్ అనుచరులు వాగ్వాదానికి దిగారు. పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లిలో కాంగ్రెస్ పార్టీ నేత జగదీశ్వర్‌రావు అనుచరునిపై జూపల్లి కృష్ణారావు అనుచరులు దాడికి పాల్పడ్డారు. సాతాపూర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డి అనుచరుడిపై దాడి చేశారు. కోడేరు, మాచుపల్లి గ్రామాల్లో పోలీసులు, బీఆర్‌ఎస్ నాయకులకు మధ్య గొడవలు జరిగాయి.

మొరాయించిన ఈవీఎంలు.. పోలింగ్ ఆలస్యం

❒ దేవరకద్ర, మక్తల్, జడ్చర్ల, కొడంగల్, అచ్చంపేట నియోజవర్గాల్లోని పలు పోలింగ్ స్టేషన్లలో ఈవీఎంలు మొరాయించాయి. సాంకేతిక సమస్యలతో కొన్ని చోట్ల ఆలస్యంగా పోలింగ్ ప్రారంభం కాగా.. మరి కొన్ని చోట్ల అంతరాయం ఏర్పడింది. దీంతో పలు ప్రాంతాల్లో రాత్రి తొమ్మిది గంటల తర్వాత కూడా పోలింగ్ కొనసాగింది.

❒ మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని గండేడ్, మహమ్మదాబాద్ మండలాల పరిధిలోని బల్సూర్‌కొండ, నంచర్ల, వెంకట్‌రెడ్డిపల్లి, చౌదర్‌పల్లి గ్రామాల్లో దాదాపు అర గంటపాటు ఈవీఎంలు మొరాయించాయి. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంతో గంటల తరబడి పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలో నిల్చొని తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. నవాబ్‌పేట మండలం యన్మన్గండ్ల, లోకిరేవు, కొండాపూర్, కాకర్లపహాడ్, మక్తల్ నియోజకవర్గంలోని ఊట్కూర్ మండలం పెద్దచెట్టు గ్రామంలోని 19వ, జడ్చర్ల మున్సిపాలిటీలోని 18వ, దేవరకద్ర మండలం జీనుగురాలలో 140వ, గోపన్‌పల్లిలోని 145వ, చిన్నచింతకుంటలోని 221వ పోలింగ్ స్టేషన్లలో ఈవీఎంలు నెట్‌వర్క్ తదితర సాంకేతిక కారణాలతో సతాయించాయి. అడ్డాకుల మండలం బలీదుపల్లి గ్రామంలో ఒకే ఒక పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయగా.. ఓటర్లు ఇబ్బంది పడ్డారు. ఇక్కడ రాత్రి ఏడున్నర గంటల వరకు పోలింగ్ సాగింది.


గద్వాలలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి


సిరా మార్కు చూపుతున్న డీకే అరుణ, డీకే భరత్‌సింహారెడ్డి, డీకే స్నిగ్ధారెడ్డి


ఓటుహక్కు వినియోగించుకున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

పోటెత్తిన ఓటరు..

- గద్వాలలో రాత్రి 9గంటల వరకు కొనసాగిన పోలింగ్
- సరళిని పరిశీలించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి
- స్ట్రాంగ్‌రూంలకు చేరిన ఈవీఎం బాక్సులు.. పటిష్ట భద్రత


మల్దకల్‌లో పోటెత్తిన ఓటర్లు

గద్వాల రూరల్/అలంపూర్: సాధారణ ఎన్నికల్లో భాగంగా గురువారం గద్వాల నియోజవర్గ పరిధిలో జరిగిన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 303పోలింగ్ కేంద్రాలలో రెండుమూడు చోట్ల ఈవీఎంల సమస్య తలెత్తినప్పటికీ ఎన్నికల అధికారులు సమస్యను పరిష్కరించి పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు. గద్వాల నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల 2,56,605 సంఖ్య కాగా, మొత్తం పోలింగ్ శాతం 82.42శాతం నమోదైనట్లు రిటర్నింగ్ అధికారి అపూర్వ్‌చౌహాన్ తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ఉదయం మందకొడిగా మొదలైంది. పోలింగ్ బూత్‌లకు ఓటేసేందుకు ఓటర్లు ఉదయం 11గంటల వరకు తక్కువ సంఖ్యలో వచ్చారు. మధ్యాహ్నం 1గంట తరువాత ఓటర్లు ఒక్కసారిగా పోలింగ్ కేంద్రాలకు తరలిరావడంతో పోలింగ్ బూతులు ఓటర్లతో బారులు తీరి కిక్కిరిశాయి. ఇదిలాఉండగా, పోలింగ్ ప్రక్రియ ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటల వరకు కొనసాగుతుందని 5గంటల తరువాత ఎవరైన ఓటేసేందుకు పోలింగ్ కేంద్రాలకు వస్తే అనుమతించమని అధికారులు స్పష్టం చేశారు. అయితే చాలా మంది నిర్ణీత సమయం మరో రెండు, మూడు నిమిషాల్లో ముగుస్తుందనంగా పరుగుపరుగునా పోలింగ్ కేంద్రాలకు చేరుకోగా, మరికొందరు సమయం దాటిన తరువాత రావడంతో ఓటేందుకు అధికారులు వారిని లోపలికి అనుమతించకపోవడంతో వెనుతిరిగి వెళ్లారు.

మధ్యాహ్నం నుంచి బారులు

మధ్యాహ్నం తరువాత ఓటర్లు పోలింగ్ కేంద్రాలలో బారులు తీరడంతో చాలా చోట్ల పోలింగ్ ప్రక్రియ రాత్రి 8గంటల వరకు కొనసాగింది. గద్వాల పట్టణం ప్రభుత్వ డిగ్రీకాలేజీలో ఓపోలింగ్ బూత్‌లో రాత్రి 9:10గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ సాగింది. అదేవిధంగా గద్వాల పట్టణం, గద్వాల, ధరూరు, గట్టు, కెటి.దొడ్డి, మల్దకల్ బూత్‌లలో రాత్రి 8గంటల వరకు పోలింగ్ కొనసాగింది.

కలెక్టర్ పర్యవేక్షణ

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్ని పోలింగ్ కేంద్రాలను కలియ తిరుగుతూ పోలింగ్ ప్రక్రియను పర్యావేక్షించారు. ఇబ్బందులు ఉన్నాయా అంటూ ఓటర్లను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ బూత్‌లలో ఎన్నికల అధికారులు, సిబ్బంది, పోలింగ్ ఏజెంట్ల వివరాలపై ఆరా తీశారు. ఈవీఎంలలో సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త చర్యలు తీసుకుని సజావుగా పోలింగ్ ప్రక్రియ పూర్తిచేయాలని ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు.

స్ట్రాంగ్‌రూంలకు ఈవీఎంలు

పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో అధికారులంతా ఊపిరి పీల్చుకున్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎం బాక్సులను గద్వాల పట్టణంలోని స్థానిక ప్రియదర్శిని మహిళా డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలకు తరలించారు. అక్కడ భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. కేంద్ర ప్రత్యేక భద్రతాబలగాలచే పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎం బాక్సులను స్థానిక ప్రియదర్శిని మహిళా డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలలో క్రమపద్ధతిలో తరలించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఎన్నికల అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.


అలంపూర్ చౌరస్తాలోని కేంద్రానికి చేరుకున్న రూట్ 21 ఎన్నికల సిబ్బంది

అలంపూర్‌లో సజావుగా..


అలంపూర్‌లోని జూనియర్ కళాశాలలో ఓటు వేయడానికి క్యూలో నిల్చున్న మహిళా ఓటర్లు

నియోజకవర్గంలో మొత్తం 76.16 పోలింగ్ శాతం నమోదైంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటర్లు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేశారు. అధికారులు ముందుగా పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేయడానికి అనువుగా ఈవీఎంలను సిద్ధం చేశారు. వ్యవసాయ పనులు, ఇతర వ్యాపార, ఉద్యోగరీత్య వివిధ పనులు ఉన్న వారు 7 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఓటర్లు తరలి రావడంతో పోలింగ్ కేంద్రాల వద్ద బారులు కనిపించాయి. ఆ తర్వాత ఓటర్ల రద్దీ కొంత తగ్గింది. కానీ సాయంత్రం 3 గంటల తర్వాత పెద్ద సంఖ్యలో రావడంతో పోలింగ్ ముగిసే ముందు కూడా కేంద్రాల వద్ద బారులు కనిపించాయి. దీంతో ఓటర్ల రాకతో పోలింగ్ కేంద్రాలు కళకళలాడాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 5 గంటల లోపు వచ్చిన వారిని పోలింగ్ కేంద్రంలోకి అనుమతిచ్చారు. పోలింగ్ కేంద్రంలోకి వచ్చిన వారిని సమయం ముగిసిన ఓటు వేసే అవకాశం కల్పించారు. అయితే పోలింగ్ ఆరంభమైన తర్వాత అక్కడక్కడ ఈవీఎంలు మొరాయించాయి. దీంతో కొద్దిసేపు పోలింగ్‌కు అంతరాయం కలిగింది.

సౌకర్యాలు మెరుగు

ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వాహనకు పటిష్టమైన చర్యలు చేపట్టింది. అందులో భాగంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా ముందస్తుగానే సౌకర్యాలు కల్పించింది. తాగునీరు, నీడ కోసం షామియానాలు వేశారు. వృద్ధులు, దివ్యాంగులు సైతం ఎన్నికల కమిషన్ కల్పించని సౌకర్యాలతో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వలంటీర్లు వృద్ధులను, దివ్యాంగులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాలను పోలింగ్ కేంద్రాలను తీసుకొచ్చారు. అక్కడికి వచ్చిన వారిని వీల్ చైర్‌లలో పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్లడంతో వారు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీల్ చైర్‌ల సంఖ్య తక్కువగా ఉండటంతో కొన్ని చోట్ల వేయడానికి దివ్యాంగులు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది.


ధరూరు మండలం మార్లబీడులో రాత్రి 8 గంటలకు ఓటర్ల బారులు

ఓటేసిన ప్రముఖులు

గద్వాల రూరల్: శాసనసభ ఎన్నికల్లో భాగంగా గురువారం గద్వాల నియోజకవర్గ పరిధిలో జరిగిన పోలింగ్‌లో గద్వాలలోని జిల్లా అధికారులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి పట్టణంలోని స్థానిక వేణుకాలనీలోని 215 పోలింగ్‌బూత్‌లో తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. అదే విధంగా బీజేపీ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు మాజీ మంత్రి డీకే అరుణ, ఆమె భర్త మాజీ ఎమ్మెల్యే డీకే భరత్‌సింహారెడ్డి, కూతురు డీకే స్నిగ్ధారెడ్డి ప్రభుత్వ ఎంఎఎల్‌డీ డిగ్రీ కాలేజీలోని 261పోలింగ్ బూత్‌లో ఓటుహక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, సతీమణి బండ్ల జ్యోతితో కలిసి స్వగ్రామం ధరూరు మండలం బూరెడ్డిపల్లిలో 64 పోలింగ్‌బూత్‌లో ఓటు వేశారు.

➪ గద్వాల మండలం కొత్తపల్లికి చెందిన యువకుడు అబ్రహంపాల్ లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. తన ఓటుహక్కును వినియోగించుకునేందుకు లండన్ నుంచి ప్రత్యేకంగా వచ్చి స్వగ్రామమైన కొత్తపల్లిలో ఓటుహక్కును వినియోగించుకున్నారు.

➪ గద్వాల పట్టణంలోని బృందావన్‌కాలనీలోని పోలింగ్ బూత్‌లో ట్రాన్స్‌జెండర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

➪ గట్టు మండలం మాచర్ల గ్రామానికి చెందిన కవలలు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

➪ గద్వాలకి చెందిన అభిరామ్ ఎల్‌ఎల్‌బి విద్యనభ్యసిస్తున్నాడు. తొలిసారిగా వచ్చిన ఓటుహక్కును వినియోగించుకున్నందుకు చాలా సంతోషంగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు.


ఓటు వేసిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఆయన సతీమణి బండ్ల జ్యోతి

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గద్వాల నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం జరిగిన పోలింగ్ సరళిని జిల్లా ఎన్నికల అధికారి వల్లూరు క్రాంతి పోలింగ్ కేంద్రాలకు వెళ్లి పరిశీలించారు. ఓటింగ్ సరళి, ఈవీఎంల పనితీరు, ఎన్నికల సిబ్బంది, పోలింగ్‌ఏజెంట్లు వంటి అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా పోటీచేస్తున్న వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు కూడా పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. బీజేపీ పార్టీకి చెందిన జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ సైతం పోలింగ్ కేంద్రాలను కలియతిరుగుతు పోలింగ్ సరళిని పరిశీలించారు.


ఓటు వేసేందుకు లండన్ నుంచి వచ్చిన అబ్రహంపాల్


తొలిసారిగా వచ్చిన ఓటు హక్కు వినియోగించుకున్న విద్యార్థి అభిరామ్



అలంపూర్‌లో తొలిసారి ఓటు వేసి సెల్ఫీ స్టాల్ వద్ద సిరా చుక్క చూపుతున్న యువ ఓటర్

ఓ(పో)టెత్తారు..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా గురువారం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7గంటల నుంచే పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు బారులుదీరారు. వృద్ధులు, దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కొన్ని కేంద్రాల్లో రాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు కుటుంబ సమేతంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాల్లో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

- సాక్షి నెట్‌వర్క్


ధారకొండ పోలింగ్ కేంద్రంలో బారులుదీరిన ఓటర్లు


మహబూబ్‌నగర్‌లో ఓటు వేసిన యువతి


రంగారెడ్డిగూడలో సతీసమేతంగా ఓటు వేసిన కాంగ్రెస్ అభ్యర్థి అనిరుధ్‌రెడ్డి


మరికల్‌లో ఓటుహక్కు వినియోగించుకున్న స్వతంత్ర అభ్యర్థి శిరీష అలియాస్ బర్రెలక్క


మహబూబ్‌నగర్ మండలం తిమ్మసానిపల్లిలో..


మేడికొండలో..


పిన్నంచర్లలో..


చెంచుపెంటలోని పోలింగ్ కేంద్రం


మహబూబ్‌నగర్ సిరా చుక్క చూపుతున్న కాంగ్రెస్ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి


మహబూబ్‌నగర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి


దమగ్నాపూర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన కాంగ్రెస్ అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి


అచ్చంపేటలో ఓటు వేసిన బాలింత


గద్వాలలో ఓటుహక్కు వినియోగించుకున్న ట్రాన్స్‌జెండర్స్


అలంపూర్‌లో..


మహబూబ్‌నగర్‌లో..


పెంట్లవెల్లిలో..


ప్రాగటూరులో ఓటువేసి పొలం పనులకు వెళ్లిన కూలీలు


నారాయణపేటలో..


మహబూబ్‌నగర్‌లో..

ఉత్సాహంగా తొలి ఓటు

18ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఎన్నికల కమిషన్ ఓటు హక్కు కల్పించడంతో అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా ఓటు వేశారు. కుటుంబ సభ్యులతో కలిసి పోలింగ్ కేంద్రాలకు ఉత్సాహంగా చేరుకొని ఓటు వేసి వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు ఆనందం వ్యక్తం చేశారు.



- సాక్షి నెట్‌వర్క్

సంతోషంగా ఉంది..



ఈ సారి మాకు ఓటు హక్కు వచ్చింది. ఫస్ట్ టైం ఓటు వేయడం చాలా ఆనందంగా ఉంది. ఎన్నికలు వచ్చే ప్రతిసారీ ఓటు వేసేందుకు మాకెప్పుడు అవకాశం వస్తుందా అని ఎదురుచూసేవాళ్లం. ఇప్పుడా అవకాశం రావడం ఉత్సాహంగా ఉంది. ప్రతి యువతీ, యువకుడు ఓటరుగా నమోదు చేసుకుని ఓటుహక్కు వినియోగించుకోవాలి.

– ఆర్.అక్షయ, ఆకాష్, మాచారం, జడ్చర్ల మండలం

కర్ణాటక నుంచి వచ్చా..



కర్ణాటకలోని మైసూర్‌లో ఎంబీబీఎస్ చదువుతున్నాను. ఈసారి ఎన్నికల్లో మొదటిసారిగా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం వచ్చింది. ఒక్క రోజు కోసం ఇంతదూరం ఎందుకని కుటుంబ సభ్యులు వారించినా ప్రజాస్వామ్యంలో ఓటు విలువ తెలుసుకొని స్వగ్రామానికి వచ్చాను. మొదటిసారి ఓటు వేయడం చాలా సంతోషంగా ఉంది.

– సృజన చైతన్య, కోస్గి

యువత పాత్ర కీలకం..



దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం. ఎన్నికల ద్వారా మన భవిష్యత్‌ను మనం నిర్ణయించుకునే అవకాశం లభిస్తుంది. అందుకే ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి. తొలిసారిగా ఓటు వేసే అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది.

– సింధూజ, పద్మావతికాలనీ, జడ్చర్ల మున్సిపాలిటీ

కొత్త అనుభూతి..



అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారిగా ఓటు వేయడం ఆనందంగా ఉంది. గతంలో బ్యాలెట్ పేపర్లపై ఓటు వేసేవారని, ప్రస్తుతం ఈవీఎంలో ఓటు వేస్తున్నారని చెబితే వినడం తప్ప.. ఓటు వినియోగం గురించి తెలియదు. మొదటిసారి పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయడం ఓ కొత్త అనుభూతిగా అనిపించింది.

– మౌనిక, ఎంసీఏ విద్యార్థిని, కోస్గి

బెంగళూర్ నుంచి వచ్చా..



ఉద్యోగ రీత్యా బెంగళూర్‌లో ఉన్నప్పటికీ ఓటు వేయడం అనేది సామాజిక బాధ్యతగా భావించి స్వగ్రామానికి వచ్చాను. ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఓటు విలువపై విస్తృతంగా ప్రచారం చేస్తున్న సందర్భంలో చదువుకున్న వాడిగా ప్రజాస్వామ్యంలో ఓటు విలువ తెలుసుకొని వచ్చి ఓటేశాను.

– సాయినిఖిల్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, కోస్గి

అభివృద్ధి కాంక్షిస్తూ..



ఈసారి ఎన్నికల్లో మొదటిసారిగా ఓటు వేయడం ఆనందంగా ఉంది. అభివృద్ధి చేసే నాయకుడు ఎవరనేది ఆలోచించి ఓటు హక్కును వినియోగించుకున్నాను. ఎన్నికల్లో గెలుపొందే అభ్యర్థి పక్షపాత ధోరణితో కాకుండా అభివృద్ధి కాంక్షతో పరిపాలించాలని కోరుకుంటున్నా.

– ఆర్యన్, బీటెక్ విద్యార్థి, నాగర్‌కర్నూల్

ఇక కొత్త మద్యం పాలసీ

- ఉమ్మడి జిల్లాలో 230 మద్యం దుకాణాలు
- నేటి నుంచి కొత్త వైన్‌షాపులు అందుబాటులోకి
- టెండర్ల ద్వారా రూ.171.90కోట్ల ఆదాయం



మహబూబ్‌నగర్ క్రైం: రెండేళ్ల పాటు కొనసాగిన మద్యం పాలసీ గురువారంతో ముగిసింది. శుక్రవారం నుంచి కొత్త మద్యం పాలసీ విధానం అమల్లోకి రానుంది. పాత మద్యం దుకాణాలు నిర్వహించే వ్యాపారులకు 75శాతం రాకపోవడంతో ఇకపై ఏం చేయాలనే ఆలోచనలో పడ్డారు. కొత్తగా దుకాణాలను సొంతం చేసుకున్న వారితో కొందరు వ్యాపార ఒప్పందం కుదుర్చుకున్నారు. మరికొందరు తమ అనుచరులు, పని చేసే వ్యక్తులతో టెండర్లు వేయించి దుకాణాలు దక్కేలా వేసిన ఎత్తుగడలు ఫలించాయి. మద్యం దుకాణాల్లో మళ్లీ లిక్కర్ కింగ్‌లదే పైచేయిగా మారింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఆగస్టు 21న నిర్వహించిన టెండర్‌లలో మొత్తం 8,595 దరఖాస్తులు వచ్చాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.171.90కోట్ల ఆదాయం సమకూరింది. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈసారి మద్యం దుకాణాలకు టెండర్లు రావడం ఆశ్చర్యం కల్గిస్తోంది. రోజురోజుకూ మద్యం వ్యాపారంపై చాలా మంది దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈసారి ఉమ్మడి జిల్లా వ్యాపారులతో పాటు ఆంధ్ర, కర్ణాటక నుంచి కూడా టెండర్లు దాఖలయ్యాయి. 2021 కంటే ఈసారి దరఖాస్తులు రెండింతలు పెరిగాయి. ప్రధానంగా మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలో దరఖాస్తులు రెట్టింపయ్యాయి.

బిజీబిజీ..

ఉమ్మడి జిల్లాలో కొత్త మద్యం దుకాణాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో గురువారం నుంచి హడావుడి మొదలైంది. 230 దుకాణాల్లో కొన్నింటిని అదే దుకాణాల్లో ఏర్పాటు చేసుకుంటుంటే.. మరికొన్ని దుకాణాలు కొత్తగా నిర్మాణం చేసుకుంటున్నారు.

లాభాలు ఉండటంతో..

మద్యం విక్రయాల వల్ల భారీగా లాభాలు ఉండటంతో మద్యం వ్యాపారులతో పాటు రాజకీయ నేతలు కూడా రంగప్రవేశం చేశారు. దుకాణం ఎవరి పేరుతో వచ్చినా అంతా కలిసే వ్యాపారం చేసుకోవాలని ముందుగానే ఒప్పందం చేసుకున్నారు. ఒక్కో దుకాణానికి ఒక్కొక్కరు 10మందికిపైగా బినామీ పేర్లతో దరఖాస్తు చేసుకున్నారు. వాళ్లలో ఏ ఒక్కరికి వచ్చినా అందరికీ లబ్ధి చేకూరేలా చేసుకున్నారు. మద్యం దుకాణాదారులే గ్రామాలు, వార్డుల్లో బెల్టు దుకాణాలకు మద్యం సరఫరా చేస్తుంటారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో రూ.4వేల కోట్ల వ్యాపారం సాగుతుండగా.. రానున్న రోజుల్లో విక్రయాలు మరింత పెరుగుతాయనే విశ్వాసంతో వ్యాపారులు ఉన్నారు.

శుక్రవారం ఉదయం 10గంటల వరకు అన్నింటిని అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో వ్యాపారులు ఆయా దుకాణాల నిర్మాణ పనులు చేస్తూ బీజీబీజీగా కన్పించారు.

జిల్లాల వారీగా దుకాణాల సంఖ్య..	మహబూబ్‌నగర్	నాగర్‌కర్నూల్	వనపర్తి	గద్వాల	మొత్తం
	90	67	37	36	230

ఈ పదేళ్లలో ఎంతో సాధించాం

- రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఈ పదేళ్లలో ఎంతో సాధించామని, ఇంకా సాధించాల్సి ఉందని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం ఉదయం జిల్లా కేంద్రంలోని శ్రీనివాసకాలనీ పీఎస్ నం.100లో ఆయనతో పాటు కుటుంబసభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పదేళ్ల క్రితం ఓటేయడానికి ప్రజలు అనేక సమస్యలతో సతమతమయ్యారని పేర్కొన్నారు. అప్పుడు తాగునీరు, రోడ్లు తదితర మౌలిక వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఇప్పుడు వాటన్నింటినీ అధిగమించి ప్రశాంతంగా ఓటు వేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆపదలో ఉన్న వారందరికీ అండగా ఉన్నామన్నారు. మరోసారి అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఒకవేళ రాష్ట్రాన్ని కాంగ్రెస్ లేదా బీజేపీ చేతుల్లో పెడితే ఆగమవుతుందన్నారు. ఈసారి గతంలో కంటే ఎక్కువ మెజారిటీ వస్తుందని భావిస్తున్నామన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, కౌన్సిలర్ పటేల్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరుద్రోత్సవం


ఆలయంలో ఎమ్మెల్యే చల్లా దంపతులు


ప్రత్యేక అలంకరణలో బాలబ్రహ్మేశ్వరస్వామి

జోగుళాంబ శక్తిపీఠం: కార్తీక మాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని అలంపురం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఆరుద్రోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోమాతకు పూజలు నిర్వహించి, ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం గణపతికి అభిషేకాలు, అలంకరణ అనంతరం భక్తులచే మహాన్యాస పారాయణాలకు అంగన్యాస, కరన్యాసాలు చేయించారు. ప్రధాన ఆలయంలో కొలువుదీరిన బాలబ్రహ్మేశ్వరుడికి నమక, చమక పారాయణాలతో 11సార్లు రుద్రాభిషేకాలు చేశారు. అన్న సూక్తం పఠిస్తూ అన్నాభిషేకాలు చేశారు. స్వామి వారిపై శ్వేత అన్నాన్ని లింగాకృతిలో తీర్చిదిద్దారు. మహానివేదనలు చేసి దశవిధహారతులు అందజేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు

ఆలయాలను దర్శించిన ఎమ్మెల్సీ చల్లా

జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సతీసమేతంగా దర్శించుకున్నారు. అలాగే బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్ఎస్ ప్రసన్నకుమార్ దంపతులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వీరికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శేషవస్త్రాలతో సత్కరించారు.

దారులన్నీ పోలింగ్ కేంద్రాలకే..


జడ్చర్ల వద్ద బస్సు టాప్‌పై వెళ్తున్న ప్రయాణికులు

జడ్చర్ల టౌన్: సాధారణ ఎన్నికల సందర్భంగా దారులన్నీ పోలింగ్ కేంద్రాలకే చేరుకున్నాయి. ఓటు వేసేందుకు హైదరాబాద్ ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు పెద్దఎత్తున స్వగ్రామాలకు చేరుకున్నారు. అలా వచ్చే వారితో 44వ జాతీయ రహదారితో పాటు గ్రామాలకు వెళ్లే రోడ్లు రద్దీగా కనిపించాయి. కొందరు ఓటర్లు నేరుగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేసి వెళ్లగా.. మరికొందరు తమ ఇళ్ల వద్దే ఉండిపోయారు.

కిటకిటలాడిన టిఫిన్ సెంటర్లు

జాతీయ రహదారితో పాటు జడ్చర్ల మున్సిపాలిటీలోని అన్ని టిఫిన్ సెంటర్లు గురువారం ఉదయం 11:30 గంటల వరకు కిటకిటలాడాయి. ఓటు వేసేందుకు వెళ్లే వారితో గిరాకీ పెరిగింది. కొన్ని హోటళ్లలో 10గంటల వరకే టిఫిన్‌లు అయిపోగా.. కొన్నింటిలో పూరి, ఇడ్లీ మాత్రమే అందించగలిగారు.


44వ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

కుమారుడి మరణం తట్టుకోలేక తండ్రి హఠాన్మరణం


నర్సింహులు (ఫైల్)

ధరూరు: ఉద్యోగం రాలేదని మనస్తాపంతో ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడాన్ని తట్టుకోలేక ఓ తండ్రి గుండెపోటుతో హఠాన్మరణం చెందిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని కుర్వవీధికి చెందిన గడ్డమీది నర్సింహులు (65), దౌలమ్మ దంపతులకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. అక్టోబర్ 5న వెలువడిన కానిస్టేబుల్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించకపోవడంతో మనస్తాపానికి గురైన కుమారుడు దేవార్జున్ (25).. అదే రోజు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు కళ్ల ముందే శవమై కనిపించడంతో తల్లిదండ్రుల రోధనలు మిన్నంటాయి. నెలన్నర రోజులుగా కొడుకు చనిపోయిన బాధలో ఉన్న నర్సింహులు.. గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

చెక్‌డ్యాంలో పడి హమాలీ మృతి

అడ్డాకుల: మూసాపేట మండలం నిజాలాపూర్ శివారులోని చెక్‌డ్యాంలో పడి ఓ హమాలీ మృతి చెందాడు. ఎస్‌ఐ కె.శ్రీనివాసులు వివరాల మేరకు.. బీహార్ రాష్ట్రంలోని చంపారామం జిల్లాకు చెందిన రమేష్‌కుమార్ యాదవ్ (35) ఇక్కడికి వలస వచ్చి హమాలీ పని చేస్తున్నాడు. గురువారం ఎన్నికలు ఉండటంతో పనులు నిలిచిపోయాయి. ఈ క్రమంలో తన మిత్రులతో కలిసి నిజాలాపూర్ గ్రామ సమీపంలోని పెద్దవాగు చెక్‌డ్యాంలో చేపలు పట్టడానికి వెళ్లాడు. చేపలు పడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో పడి గల్లంతయ్యాడు. గమనించిన అతడి మిత్రుడు ఇంద్రజిత్.. తన మిత్రులకు సమాచారం ఇచ్చాడు. అందరూ కలిసి రమేష్‌కుమార్‌ను బయటికి తీసి ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఓటర్లపైకి దూసుకెళ్లిన వాహనం

- ఒకరికి గాయాలు

వీపనగండ్ల: వనపర్తి జిల్లా వీపనగండ్ల పోలింగ్ కేంద్రంలో గురువారం ఓటు వేసేందుకు వచ్చిన వారిపైకి సెక్టోరియల్ అధికారి వాహనం దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. వీపనగండ్ల సెక్టోరియల్ అధికారి రవినారాయణ పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించేందుకుగాను రాగా.. వాహనం అదుపుతప్పి ఓటర్లపైకి దూసుకెళ్లింది. ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన నర్సింహ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కోపోద్రిక్తులైన గ్రామస్తులు.. వాహనం అద్దాలను ధ్వంసం చేశారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదు చేస్తామని అడిషనల్ ఎస్పీ రాందాస్ తేజ తెలిపారు.


ప్రమాదంలో గాయపడ్డ నర్సింహ

ఆటో బోల్తా: ముగ్గురికి గాయాలు

అడ్డాకుల: మూసాపేట మండలం సంకలమద్ది గ్రామ శివారులోని జాతీయ రహదారిపై ఆటో బోల్తాపడిన ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని నాటవెల్లికి చెందిన మన్యం, నాని, మరో మహిళ ఓటు వేసేందుకు ఆటోలో బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వస్తుండగా, సంకలమద్ది శివారులో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ముగ్గురికి గాయాలు కావడంతో ఎల్‌అండ్‌టీ అంబులెన్స్‌లో వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. బోల్తా పడిన ఆటోను ఎల్‌అండ్‌టీ సిబ్బంది క్రేన్ సాయంతో మూసాపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.


ప్రమాదానికి గురైన ఆటో

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌లు లంటిస్తుంది.వ్యక్తిగత.విద్య.టేక్ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్నూలు, ✆ 9311685170. (T-1258784)

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి, మేనేజర్